## పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దు


కార్మికులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ అరుణా రవీందర్‌రెడ్డి

**సైదాబాద్:** పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయరాదని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి కార్మికులకు సూచించారు. శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి స్థానికులను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సైదాబాద్‌లో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పలు సూచనలు చేశారు. కార్మికులు తమకు కేటాయించిన కాలనీలు, బస్తీల్లోని చెత్తను పోగు చేసి జీహెచ్‌ఎంసీ వాహనాల్లో తరలించాలని, అంతేగానీ స్థానికంగా కుప్పలా పోసి కాల్చవద్దని ఆదేశించారు. కాలనీవాసులు కూడా పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాలలో ఉంచి కార్మికులకు అందజేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అందరూ సహకరించాలని కార్పొరేటర్ కోరారు.

## పర్మిట్ రూమ్‌ల్లో తినుబండారాలు విక్రయిస్తే చర్యలు

**హస్తినాపురం:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపుల్లో పర్మిట్‌రూమ్‌లు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా తినుబండారాలు విక్రయిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ ఎస్పీ ప్రదీప్‌రావు హెచ్చరించారు. హస్తినాపురం చౌరస్తా సమీపంలో నాగార్జున సాగర్ రహదారిపై నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన డైమండ్ లిక్కర్‌మార్టుపై వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్ నిర్మించి బార్‌ను తలపించేలా తినుబండారాలను ఏర్పాటు చేసినందుకు కేసు నమోదు చేశారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైన్‌షాపుల్లో పర్మిట్‌రూమ్‌లు వంద మీటర్ల వరకు మాత్రమే నిర్మించాలని, అందులో ఎలాంటి తినుబండారాలు ఏర్పాటు చేయవద్దని, అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డైమండ్ లిక్కర్ మార్టుపై కేసు నమోదు చేశామని, ఈ కేసు వివరాలను కమిషనర్‌కు పంపిస్తామన్నారు. లిక్కర్ మార్టు నిబంధనలు అతిక్రమించినందుకు దాదాపు లక్షకు పైగా జరిమానా విధించే అవకాశం ఉందని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ ఎస్‌ఐ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భూకబ్జాలపై సమగ్ర విచారణ జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌నాయక్

**హస్తినాపురం:** డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీలో జరిగిన భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కెతావత్ రమేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన హస్తినాపురంలో విలేకరులతో మాట్లాడుతూ, శ్రీరమణకాలనీలోని సర్వే నంబర్ 60లో 1983లో లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించారని, ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు నగరంతో పాటు దేశ, విదేశాల్లో ఉన్నారన్నారు. ఇదే అదునుగా చేసుకొని కొంతమంది భూకబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలకు తెరలేపారన్నారు. సుమారు 10 ప్లాట్లను కబ్జాచేసి, ఆ స్థలంలో కొంత భాగం నకిలీ డాక్యుమెంట్లతో ఇతరులకు అమ్మి రిజిస్ట్రేషన్లు కూడా చేశారన్నారు. కబ్జా చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ అధికారులు అనుమతులు ఇచ్చారని రమేశ్‌నాయక్ ఆరోపించారు. సర్వే నంబర్ 60లోని ప్లాట్ల కబ్జాపై రెవెన్యూ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని, రిజిస్ట్రేషన్లు చేసిన సబ్‌రిజిస్ట్రార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రామాచారి, లింగయ్యలు పాల్గొన్నారు.

## ప్రజాసేవే లయన్స్ లక్ష్యం

**నాగోలు:** నిరంతరం ప్రజలకు అనేక రకాలైన సేవలు అందించే లక్ష్యంతో లయన్స్ క్లబ్ పని చేస్తోందని, ఇందులో భాగంగానే ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం భారీ స్థాయిలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ అన్నారు. రూ.10 కోట్ల వ్యయంతో బాటసింగారంలో పావని ప్రకాష్ పేరుపై హోస్పిస్ పల్లియాటివ్ కేర్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్న ఆయన తెలిపారు. ఆస్పత్రి ఏర్పాట్లకు సహకారం అందిస్తున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ సీహెచ్. ప్రకాష్ రావును శుక్రవారం విజయ రంగా, కొట్టం జంగయ్య యాదవ్ కలిసి సత్కరించారు.


లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ ప్రకాష్‌రావును కలిసిన విజయరంగా తదితరులు

కేన్సర్, గుండె, కిడ్నీ ఫెయిల్యూర్, ఇతర మొండి జబ్బులతో బాధపడే వారికి ఈ సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

## రోడ్లపై చెత్త వేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి


పీ అండ్ టీ కాలనీలో రహదారుల పక్కన ఉన్న చెత్తను తొలగింపజేస్తున్న కార్పొరేటర్

**చైతన్యపురి:** మార్కెట్లలో విక్రయించగా మిగిలిన కూరగాయలు, పండ్లు రోడ్లపై పారవేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కూరగాయల సంతలో మిగిలిపోయిన, కుళ్లిపోయిన కూరగాయలను పీ అండ్ టీ కాలనీ ప్రధాన రోడ్డు పక్కన పారవేయడం వల్ల తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వచ్చిన ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ శానిటేషన్ సిబ్బందిని పిలిపించారు. రోడ్లపక్కన ఉన్న చెత్తను ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఇళ్లలోని చెత్త సేకరించే స్వచ్ఛ రిక్షా కార్మికులు రోడ్లపై చెత్తను డంప్ చేస్తున్నా శానిటేషన్ సూపర్‌వైజర్లు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత శానిటేషన్ సూపర్‌వైజర్లదే అని అన్నారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాంకీ వార్డు ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోత్స్న, స్థానికులు దాసరి జయప్రకాష్, ఏనుగు శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, టింకు, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


బాక్స్ టైప్ వరద నీటి కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**చంపాపేట:** ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించటంతో పాటు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన చంపాపేట డివిజన్ న్యూ పద్మానగర్ కాలనీలో ప్రారంభించిన బాక్స్‌టైప్ వరద నీటి కాలువ పనులను స్థానిక కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కాలనీలోని వరద నీటి కాలువ ఎత్తును పెంచడం వల్ల కాలువ పరిసరాల్లోని కొన్ని ఇళ్లు ముంపు సమస్యను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని కావున కాలువ ఎత్తును తగ్గించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. అధికారులతో చర్చించి ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో ప్రారంభించిన వరదనీటి కాలువల నిర్మాణ పనులు వచ్చే వర్షాకాలం నాటికి పూర్తవుతాయని, దీంతో ఆయా కాలనీల్లో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న సమయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తడం సహజమని కాలనీవాసులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ముడుపు రాజిరెడ్డి, రవి ముదిరాజ్, మల్లేష్‌గౌడ్, ఉమామహేశ్వర్, నగేష్, శివ, నిషీకాంత్‌రెడ్డి, జగదీష్, కాలనీ వాసులు శ్రవణ్‌కుమార్, యాదయ్య, విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

### తాగి వాహనాలు నడిపిన 12 మందికి జైలు శిక్ష

**సైదాబాద్:** మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో చిక్కిన 12 మంది నిందితులకు న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధించిందని సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్ తెలిపారు. సంతోష్ నగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన 12 మందిని శుక్రవారం నాంపల్లి 9ఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ ముందు పరిచామన్నారు. అందులో ఒకరికి 8 రోజుల జైలుశిక్ష, ఏడుగురికి 4 రోజులు, నలుగురికి 2 రోజుల జైలు, అందరికీ జరిమానా విధించారని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

### ఆలయంలో చోరీ చేసిన పాతనేరస్తుడి అరెస్టు

**చైతన్యపురి:** చెడు అలవాట్లకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం చైతన్యపురి బస్‌స్టాప్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని క్రైమ్ పార్టీ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం విషయం బయటపడింది. షేక్‌పేటకు చెందిన గాజుల ప్రశాంత్ అలియాస్ క్రీసుదాసు (24) మద్యంతో పాటు చెడు అలవాట్లకు బానిసై సులువుగా డబ్బు సంపాదించేందుకు నేరాల బాటపట్టాడు. ఇదే క్రమంలో అల్కాపురి కాలనీలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం తాళాలు పగలగొట్టి 17 గ్రాముల బంగారు పుస్తెలు, వెండి వస్తువులు, క్యాష్ కౌంటర్‌లోని రూ.7,461 నగదు దొంగిలించినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. నిందితుడు ప్రశాంత్ పాత నేరస్తుడని, సూర్యాపేట, కోదాడ, కట్టంగూరు, నార్సింగ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 12 కేసులు నమోదై ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

### పాత పెన్షనే అమలు చేయాలి

**ఇబ్రహీంపట్నం:** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూ తెలంగాణ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం పీఆర్టీయూ మండల శాఖను ఎన్నుకున్నారు. సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. ఎన్నో నెలలుగా పెండింగ్ ఉన్న మెడికల్, సరెండర్ బిల్లులు, జీపీఎఫ్ రుణాలు, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సీనియర్ సిటిజన్ల సేవలు సమాజానికి అవసరం


బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ తదితరులు

**మన్సూరాబాద్:** సీనియర్ సిటిజన్ల అనుభవాలు, సేవలు సమాజానికి ఎంతో అవసరమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ చంద్రపురి కాలనీలోని సంక్షేమ సంఘం భవనంలో ఇండోర్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ, వయోవృద్ధులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో పనిచేసి విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్స్ సిటిజన్లు చెప్పే విషయాలు యువత అనుసరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు, ఆర్గనైజర్ సోమిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యాదిరెడ్డి, సుధాకర్, మధుసూదన్‌రావు, అమృత్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపురం కాలనీ సమస్యలను పరిష్కరిస్తా..


ఎమ్మెల్యేతో శ్రీపురం కాలనీ ఫేజ్–2 వాసులు

**ఎల్‌బీనగర్:** బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్–2 నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, కోశాధికారి జంగయ్యగౌడ్, సభ్యులు నరసింహారెడ్డి, వెంకటరమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుహాసిని, దీప, రాజేందర్ పాల్గొన్నారు.

## జిల్లా కోర్టులో ఉద్యానవనం ప్రారంభం



న్యాయమూర్తులతో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

**రంగారెడ్డి కోర్టులు:** తెలంగాణ న్యాయవాద పరస్పర సహకార సంఘం సౌజన్యంతో జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన ఉద్యానవనాన్ని ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్ రెడ్డి, మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పట్టాబి రామారావు శుక్రవారం ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్, కోర్టు సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయిరెడ్డి, రాజీవ్ రెడ్డి, శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఉద్యానవనానికి నిధులు మంజూరు చేశారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దీకొండ రవీందర్, పట్లోళ్ల మాధవ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వినోద్ కుమార్, సందీప్ గౌడ్, దీప్తి నాగేందర్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ రుణ సాయాన్ని వినియోగించుకోవాలి




**దిల్‌సుఖ్‌నగర్:** సాంప్రదాయ, హస్తకళాకారులకు సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని కోవే సంస్థ తెలంగాణ ఛాప్టర్ అధ్యక్షురాలు, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి అన్నారు. శుక్రవారం ఆర్‌కే పురం డివిజన్ భాగ్యనగర్ ఫంక్షన్ హాల్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ స్కిల్ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమాన్ని కోవే, ఎంఎస్‌ఎంఈల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే రుణ సాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బీసీ సంక్షేమ శాఖ రంగారెడ్డి జిల్లా అధికారి నీరజారెడ్డి, కేంద్ర పరిశ్రమల రంగారెడ్డి జిల్లా జీఎం రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అలంకార ప్రాయంగా ‘రోబోటిక్’

- నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన మిషన్
- ఏడాది నుంచి నీటి ఒడ్డునే..
- పరికరాలు ఎత్తుకెళ్తున్న దొంగలు



చందన చెరువులో శిథిలావస్థకు చేరుకుంటున్న రోబోటిక్ యంత్రం

**మీర్‌పేట:** గుర్రపుడెక్క తొలగింపునకు తీసుకువచ్చిన యంత్రం నిరుపయోగంగా మారి పాడయ్యే దుస్థితికి చేరింది. కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువులోని గుర్రపుడెక్క, వ్యర్థాలను తొలగించేందుకు గాను రూ.16లక్షలు విలువ చేసే సోలార్‌తో పనిచేసే రోబోటిక్ మిషన్ (యంత్రాన్ని) గతేడాది ప్రారంభించారు. ప్రారంభించిన మొదటిరోజు గంట సేపు.. ఆ తరువాత ఓ నాలుగుసార్లు మాత్రమే ఈ యంత్రాన్ని వినియోగించారని వాకర్స్ తెలిపారు. అనంతరం యంత్రాన్ని చెరువులోని బతుకమ్మ ఘాట్ వైపు ఓ మూలన తాళ్ళతో కట్టేసి ఉంచారు. నిర్వహణ లేక ఇది అలంకార ప్రాయంగా మారిందని ప్రజలకు చర్చించుకుంటున్నారు. నాడు యంత్రాన్ని లాంఛనంగా ప్రారంభించిన కార్పొరేషన్ అధికారులు కొంత కాలంగా పట్టించుకోకపోవడంతో యంత్రం శిథిలమై పాడైపోతోందని వాకర్స్ వాపోతున్నారు.

**పరికరాలు మాయం**

ఆర్భాటంగా యంత్రాన్ని తీసుకొచ్చి ప్రారంభించి ఆ తరువాత గాలికి వదిలేయడంతో ఏడాదిగా ఖాళీగానే పడివుందని, ఇటీవల దొంగలు యంత్రానికి అమర్చిన సీసీ కెమెరా, డోర్‌లతో పాటు ఇతర పరికరాలను ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అదే విధంగా నీటిలోనే ఉంచడంతో విలువైన బ్యాటరీలు సైతం పాడయ్యాయని వాకర్స్ చెప్పారు. తీసుకొచ్చిన యంత్రం ఎందుకూ పనికిరాకుండా కొన్ని నెలలుగా ఓ మూలన ఉండటం.. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై స్థానికులు, వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకంగా చెరువును అభివృద్ధి చేయడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో సేదతీరేందుకు వస్తుంటారు. కార్పొరేషన్ అధికారులు చెరువు వద్ద నిర్వహణతో పాటు పర్యవేక్షణ సైతం అవసరమని వాకర్స్ సూచిస్తున్నారు.

> **మరమ్మతులు చేయాలి**
>
> యంత్రాన్ని ప్రారంభించిన కొన్ని రోజులకే పనితీరు సరిగ్గా లేకపోవడంతో మరమ్మతులు చేయాలని సదరు ఏజెన్సీకి సూచించాం. యంత్రానికి మరమ్మతులు పూర్తయ్యాకే పనితీరు బావుంటే పనులు కొనసాగిస్తాం.
>
> – శ్రీనివాసులు, ఏఈ, మీర్‌పేట కార్పొరేషన్

## మర్యాదపూర్వక కలయిక


గవర్నర్‌కు భగవద్గీతను బహూకరిస్తున్న నక్క శ్రీనివాస్‌యాదవ్, ఉమేష్‌కుమార్‌యాదవ్

**వనస్థలిపురం:** వనస్థలిపురానికి చెందిన నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు నక్క శ్రీనివాస్‌యాదవ్, నక్క ఉమేష్‌కుమార్‌యాదవ్‌లు శుక్రవారం రాష్ట్ర గవర్నర్ తమిళిసైని మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు భగవద్గీతను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తగు ప్రోత్సాహకాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు గవర్నర్ దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి వచ్చే బడ్జెట్ సమావేశాలలో అత్యధిక నిధులు కేటాయించేలా చొరవ చూపాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుండాల గోవర్ధన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చంపాపేట:** విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. చంపాపేట, దుర్గా భవానీనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం గంట 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈస్ట్ మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్, సుల్తానాఅల్వా, అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెంట్రల్ ఎక్సేంజ్, డీఎస్ నగర్, వినయ్‌నగర్, శ్రీనివాసనగర్ హాస్పిటల్ పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ వినియోగ దారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

◆ **అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ...**

సైదాబాద్: అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఈ దిగువ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

◆ **ఉదయం 9.30 నుంచి మ.12.30 గంటల వరకు...**

వినాయక్ నగర్, దోభీఘాట్, చంద్రయ్య హట్స్, ఖాసీం కాలనీ, ఓల్డ్ ఈద్గా, దరాబ్‌జంగ్ కాలనీ, చోటూ భాయ్ కాలనీ, మాదన్నపేట వాటర్‌ట్యాంక్, సాయిబాబా టెంపుల్, కేజీఎస్ బేకరీ, ఓల్డ్ పీఎస్ పరిసర ప్రాంతాలు.

◆ **మ.2 నుంచి సా.4 గంటల వరకు...**

ఎస్ఆర్‌టీ కాలనీ, గాంధీ కా పుత్లా, మార్నింగ్ స్టార్, కమ్యూనిటీ హాల్, టెంపుల్ పీటీ, అజ్మత్‌నగర్ నాలా, ఇమాం బడా నాలా పరిసర ప్రాంతాలు.

◆ **సా.4 నుంచి సా 5 గంటల వరకు...**

వాహెద్ కాలనీ, ఆల్ఫా గ్రౌండ్, ఇసామియా కాలేజ్, సయ్యద్ చౌస్ పీటీ, అజాద్‌పార్క్, గంగం బౌలీ, అజారియా మసీద్, ఇండియా ఫంక్షన్‌హాల్ పరిసర ప్రాంతాలు..

## సన్మానాలు బాధ్యతను పెంచుతాయి


నంది జ్ఞాపికతో డాక్టర్ కావాడి ఎల్లయ్య

**సైదాబాద్:** సన్మానాలు, పురస్కారాలను అందుకోవడం మనలో బాధ్యతను మరింత పెంచుతాయని డాక్టర్ కావాడి ఎల్లయ్య అన్నారు. నిరుపేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడమే కాకుండా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఆయన చేసిన ఎనలేని సాహితీ సేవలను గుర్తించిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ఇటీవల నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించింది. సంస్థ నిర్వాహకులు ఆయనకు నంది జ్ఞాపికను పురస్కారంగా అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ, వైద్య సాహితీ రంగాల్లో తాను చేసిన సేవలకు గుర్తింపు రావడం ఆనందంగా ఉందని అన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌రెడ్డి



**హస్తినాపురం:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా హస్తినాపురం విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మంకాల శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

**రంగారెడ్డి కోర్టులు:** దారిలో అడ్డు తప్పుకోమని చెప్పిన వ్యక్తిపై తల్వార్‌తో దాడి చేసిన నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 2వ అదనపు సెషన్స్ ఇన్‌చార్జి న్యాయమూర్తి మాధవీలత తీర్పు ఇచ్చారు. కోర్టు పీపీ కోమలత తెలిపిన వివరాల ప్రకారం... 2023 జూన్ 20న బాధితుడు అత్తాపూర్ ఠాణా పరిధిలో లిమ్రా హోటల్ సమీపంలోని ఏటీఎం నుంచి డబ్బులు తీసుకుని బయటకు వస్తుండగా..ఓ వ్యక్తి అడ్డంగా నిలబడ్డాడు.పక్కకు జరగమని చెప్పినా అతను పట్టించుకోలేదు. దీంతో బాధితుడు ఇదే పద్ధతి అంటూ నిలదీసి అక్కడి నుంచి తన ఇంటికి బయలుదేరాడు. అతడిని వెంబడించిన నిందితుడు మన్‌ప్రీత్ తల్వార్‌తో దాడి చేశాడు. దాడిలో బాధితుడి కంటి చూపు పోయింది. అతడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన అత్తాపూర్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు శుక్రవారం నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

## రాజరాజేశ్వర ఆలయానికి భక్తుల తాడికి



**మహేశ్వరం:** శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం నిర్వహించారు. శివుడి పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిలో ‘బీ గుడ్.. డూ గుడ్’

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ఫిట్‌నెస్ క్లబ్ ఆఫీస్ బేరర్లు, సంస్కృతి ఫౌండేషన్ మరియు మిథానీలు కలిసి శుక్రవారం సంయుక్తంగా సుపోషణ్ సమిష్టి–వివేక్ బ్యాండ్–2024 పేరుతో బీ గుడ్.. డూ గుడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఆధ్యాపకులు తీసుకోవలసిన వర్క్‌షాప్‌లు, విద్యార్థుల భవిష్యత్ ఆధారంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.